స్నేహ విత్తనాలు

మిషెల్



స్నేహ విత్తనాలు

మిషెల్



ఆదాముకి వాళ్ల కొత్త ఇల్లు నచ్చింది.

నగరంలో చాలా, చాలా ఎత్తైన భవనంలో అది ఉంది.
అతనికి ఎంతో ఉత్సాహంగా ఉంది, ఆకాశంలో
ఉన్నట్టు ఉంది.



అయితే ఆదాముకి అతను వచ్చిన గ్రామీణ ప్రాంతం కూడా గుర్తుకు వస్తోంది. ప్రతి సాయంత్రం అమ్మనీ, నాన్ననీ కథలు చదివి వినిపించమని అడిగి తన పాత ఇల్లును గుర్తు చేసుకునేవాడు.

ఆ కథలకి ఆదాము బొమ్మలు గీసి తన గది గోడలకు అంటించేవాడు.



తన గది కిటికీ లోంచి బయటకు చూస్తే అతనికి చాలా భిన్నమైన బొమ్మ కనిపించేది. బూడిదరంగులోని చల్లని ప్రపంచం అది.

అది చాలా శూన్యంగా కూడా అనిపించేది. కింద భవనాల నీడలో ఆడుకుంటున్న పిల్లలు అప్పుడప్పుడు అతనికి కనిపంచేవాళ్లు. కిందకి వెళ్లి వాళ్లని పలకరించేటంత చొరవ అతనికి లేదు.

ఒక ఉదయం తన కిటికీ నుంచి ఆదాముకి ఏమీ కనపడలేదు. అద్దానికి తేమ పట్టి ఉంది. అది ఆదాముకి గడ్డకట్టిన అడవిని గుర్తు చేసింది. ఆదాము తన వేలితో అడవిలో ఉండే జంతువుల బొమ్మలు గీశాడు.

తన అద్దం అడవి నిండిపోయిన తరవాత పక్క కిటికీకి వెళ్లాడు. అలా ఒకటొకటిగా అన్ని కిటికీలు నింపేశాడు.

ఆ రాత్రి ఆదాము మొదటి
సారిగా మంచు చూశాడు.



ఉదయం బూడిద రంగు ప్రపంచం మాయమై తెల్లటి అద్భుత ప్రపంచం వెలిసింది! ఆదాము కిందకి వెళ్లి, మంచులోకి పరిగెత్తాడు. చాలా చలిగా ఉంది!

కొంతమంది పిల్లలు మంచు మనిషిని చేస్తున్నారు.



ఆదాము మంచుని తాకాడు. అది ఏక కాలంలో తేలికగా, తడిగా, చల్లగా అనిపించింది. మంచుతో ఏనుగును చెయ్యటం మొదలుపెట్టాడు.

“అది చాలా చిన్న ఏనుగు!” ఒక అబ్బాయి నవ్వుతూ అన్నాడు. “పెద్ద ఏనుగు చేద్దాం.” ఒక మంచు ముద్దని అతనిపైకి విసిరారు. ఆదాము నవ్వాడు.

అందరూ కలిసి తమకి చేతనైనంత
పెద్ద ఏనుగుని తయారు చేశారు.

అది అయిన తరవాత ఆదాము మంచుతో
నీటి గుర్రాన్ని చెయ్యటం మొదలుపెట్టాడు.
ఇతర పిల్లలు కూడా అతనిని
అనుకరించసాగారు. మంచు
ఖడ్గమృగాలు, సింహాలు, మంచు
మొసలి, చివరికి మంచు ఒంటె
కూడా తయారయ్యింది. భోజన
సమయానికి మంచు జంతు
ప్రదర్శనశాలకి బాధ్యత వహించే ఒక
మంచు మనిషి కూడా తయారయ్యాడు!



కొన్ని రోజులకు ఆ మంచు ప్రపంచం కరిగిపోయింది.

ఆదాము కొత్త బడిలో చేరాల్సిన సమయం వచ్చింది.

తనకు కొత్తగా పరిచయమైన స్నేహితులు కొంతమంది ఆ బడిలో ఉండటం అతనికి సంతోషాన్నిచ్చింది. వాళ్లు అతనికి బడంతా చూపించారు. అన్నిటిలోకి ఆదాముకి చిన్న తోట నచ్చింది. బూడిద ఆటల మైదానంలో ఆ పచ్చదనం ఎంతో అద్భుతంగా ఉంది.

ఇంటికి తీసుకుని వెళ్లటానికి ఆదాముకి వాళ్ల టీచరు కొన్ని విత్తనాలు ఇచ్చారు. అతను వాటిని వాళ్ల అమ్మకి ఇచ్చాడు. అవి ఏ విత్తనాలో అతనికి తెలియదు. వాళ్ల అమ్మ వాటిని కిటికీలోని పెట్టెలలో నాటింది. “ఏమవుతుందో చూద్దాం,” ఆమె అంది.



నెలలు గడుస్తున్న కొద్దీ బడిలో తోట పెరుగుతోంది. ఆదాము మరిన్ని మొక్కలు, విత్తనాలు తన ఇంటికి తెచ్చాడు. కిటికీ డబ్బాలు నిండిపోయిన తరవాత ఆదాము, అతని స్నేహితులు డబ్బా , కుండీలు వంటివి సేకరించి భవనం పైకి తీసుకుని వెళ్లారు. అందరూ కలిసి ఆకాశంలో తోట చేశారు. “మరిన్ని తోటలు చేద్దాం!” అన్నారు పిల్లలు.

దాంతో, ఖాళీ ప్రదేశం కనపడితే చాలు ఆదాము, అతని
స్నేహితులు తోటను పెంచసాగారు.



ఇప్పుడు ఆదాముకి బూడిద రంగు ప్రపంచం కనిపించటం లేదు.

అతనికి తోటలతో ఉన్న నగరం కనిపిస్తోంది.

ప్రతి కాలం తనదైన రంగులను, అద్భుతాలను తీసుకుని వస్తుందని అతనికి తెలుసు. స్నేహ విత్తనాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని కూడా అతనికి తెలుసు.

అయిపోయింది